# ఉద్వేగాలు



పాప

ఉద్వేగాలంటే నాకు చాల అసహ్యం.

ఏమీ కారణం లేకపోయినా ఏడవగలగడం ఒక గొప్పతనమేమోగాని సంఘమర్యాదకీ, నాగరికతకీ తగినదిమాత్రం కాదు. పెద్దవాళ్లెవరయినా కంట నీరు పెట్టుకుని ఏడిచారంటే నాకు రోత. నాకేగాదు నాగరికత అంటే తెలిసిన ప్రతివాడికీని. హరిశ్చంద్రనాటకంలో కూర్చుంటే వేషాలు వేసేవాళ్ళు సరిగా ఏడవలేకపోయినా, మనకి అటూ ఇటూ కూర్చున్నవాళ్ళు ముక్కులు చీదుకుంటూ, గొంతులు సవరించుకుంటూ కళ్ళనీరు తుడుచుకోడం చూసినప్పుడల్లా "అరెరే! ఏమిటీ మూఢత్వం?'' అనుకుంటాను. పరామర్శకి వెళ్లే పెదమనుష్యులంతా తేలికగా కళ్ళనీళ్ళు తెప్పించుకుని కష్టమంతా తమదయినట్టుగా నటించగలగడం చాలా కష్టమేమోగాని, అది సభ్యత ఎంతమాత్రం కాదని నా నిశ్చితాభిప్రాయం.

నాకు ముప్ఫయిఏళ్ళ క్రిందటి మాట జ్ఞాపకం వస్తోంది. మా చెల్లెలి నప్పుడు శేషి అనేవాళ్ళం. దానికి అయిదోఏడు. నాకు తొమ్మిది. మా అమ్మమ్మగారి ఇంటి దగ్గర మాకిద్దరికీ బాగా అలవాటు. మా

అమ్మ లేకపోయినా ఒకటి రెండువారాలు మా అమ్మమ్మదగ్గర శేషి ఉంటూఉండేది మా అమ్మ నాన్న కాశీ రామేశ్వరాలు యాత్రవెడుతూ, ఉండగలమనే ధైర్యం మీద శేషినీ, నన్ను అమ్మమ్మగారింటి దగ్గర వదలి వెళ్ళిపోయారు.

అప్పుడు మా శేషి చాల చలాకిగా ఉండేది అది అంటే అందరికీ చాల ముద్దు. అంతా దాన్నే ఎత్తుకునేవారు. అంచేత నాకు కొంచెం ఈర్ష్యగా ఉండేది దానిమీద నాకు అధికారం ఉందని నిరూపించుకోడానికి అప్పుడప్పుడు కొంచెం కేకలు వేసేవాడిని. దానికి కోపంవస్తే. "రాజీగాలి జతుందను" అనేది. నేను కొంతసేపు జవాబుచెప్పకుండా కూర్చుంటే దగ్గరగా వచ్చి, "ఉంతాను నీ నన్నెప్పుడూ అల్లా అనకేం మరి.' అని సమాధానపడేది.

దానిమాటలు అందరికీ నవ్వువచ్చేవి. ఒకనాడు రాత్రి గదిలోకి ముందు మా అత్తయ్య వెళ్ళింది. తరువాత మా మామయ్య వెళ్ళాడు. మామయ్య తలుపు దగ్గరగా వేసుకుంటున్నాడు అప్పుడు మా అమ్మమ్మ పక్కని పడుకున్న శేషి ముఖం అదో మోస్తరుగా పెట్టి అందిగదా, "ఛీ! అసయ్యమమ్మ! ఎవరన్నా గదిలో తలుపేసుకు పరుకుంతారేంతి! ఛీ!" అని. మామయ్య వెంటనే తలుపుతెరిచి పకపక నవ్వి దాన్ని ఎత్తుకొని గదిలోకి తీసుకు వెళ్ళాడు. మా అత్తయ్య దానికో పాట నేర్పింది.

"అలంకరించుకోవే కోడలా! అత్త వారింటికి పోవాలి"

అనఇపాట ముద్దుగా ఉన్నా లేకపోయినా, మాచెల్లి భాషలో అది రూపాంతరం పొంది ఎంతో ముద్దుగా ఉండేది. మేము అమ్మమ్మగారింటి దగ్గర ఉన్నప్పుడు పక్కయింట్లో ఒక అమ్మాయికి కార్యమయింది. మేమంతా భోజనానికి వెళ్లాము. నాలుగోనాడు ఆ అమ్మాయి అత్తవారింటికి వెళ్లేనాడు మావాళ్ళంతా చూడ్డానికి వెడుతుంటే నేను శేషికూడా వెళ్లాము. ఆ అమ్మాయి ఒకగదిలో చీర కట్టుకుంటోంది. శేషి ఆడుతూ పాడుతూ అక్కడికివెళ్ళి పాడింది,

"అలంకరించుకోవే కోడలా! అత్త వారింటికి పోవాలి"

ఆపాట అర్థం దానికి అసలు తెలియదు, కాని పాపం ఆ అమ్మాయి కళ్ళనీరు పెట్టుకుంది.

ఎవరూ లేకుండా ఆడుకుంటూ ఉన్నప్పుడల్లా ఈపాటే అది పాడుకుంటూ ఉండేది. గంతులువేస్తో, పువ్వులు కోసుకునేటప్పుడు, మట్టితో ఇళ్ళు కట్టుకునేటప్పుడు అదేపాట!

"అలంకరించుకోవే కోడలా! అత్త వారింటికి పోవాలి.'

కాని చివరకి శేషి అత్తవారింటికి పోయేనాటికి ఈపాట దానికి జ్ఞాపకం లేదు.

శేషి అమ్మకోసం బెంగ పెట్టుకున్నాఅభిమానంచేత పయికిచెప్పేదికాదు. ఒకనాడు నేను అన్నాను "శేషి అమ్మకోసం బెంగ పెట్టుకుందోయ్" అని.

దానికి రోషం వచ్చింది. "ఎదవా! నువ్వే బెంగ త్తుకున్నావు" అని ఏడుపు మొదలుపెట్టింది. ఆనాడే మొదలు దానికి జ్వరం. అది ఓపిక ఉన్నంతవరకూ తిని, తిరగడంమాత్రం మానలేదు. ఆరోజు నుంచీ అసి ఎవరితోటీ ఆట్టే మాట్లాడేది కాదు

ఒకనాడు అది మట్టితో ఇల్లుకడుతూ తనలో తను అనుకుంటోంది. "ఇది అమ్మకీ, ఇది నాన్నకీ, ఇది నాకూ, ఇది అన్నయ్యకీ, ఛీ! ఇది అన్నయ్యకి లేదు. నన్ను బెంగ త్తుకున్నానన్నాడు. నేను బెంగ త్తుకున్నానేంతి?"

దాని కళ్ళలోకి ఏడుపు వచ్చేసింది. వెంటనే లేచి, కాలితో ఆ ఇల్లు తన్ని పారేసి గొంతెత్తి పాడింది. "అలంకరించుకోవే కోడలా, అత్తవారింటికి పోవాలి."

కాని ఏడుపాగలేదు. కళ్ళు నులుపుకుంటూ వెనక్కి తిరిగితే నేను కనబడ్డాను. మళ్ళీ అభిమానపడి, 'అలంకరించుకోవె కోడలా....' శక్తికొలదీ గొంతుఎత్తి పాడింది.

"అన్నయ్యా! మనం మనూరెళ్లిపోతాం కదూ?"

"అమ్మ, నాన్న వచ్చాకాను." అన్నాను నేను,

"వచ్చాకేలే' అంది.

మరునాడు అది మంచంమీదనుంచి లేవలేదు. మా అమ్మమ్మ చాలా భయపడింది. నిద్రలో అప్పుడప్పుడు పలవరింతలు మా నాన్నకి తంతి ఇచ్చారు.

రెండురోజులు శేషి కళ్ళువిప్పలేదు. మూడవనాడు మధ్యాహ్నం కొంచెం తెలివి వచ్చి నాలుగు ప్రక్కలా కలియచూసింది. తను అనుకున్నదేదో కనబడన ఊపిరివిడిచి మళ్ళీ పడుకుంది. మా అమ్మమ్మ దగ్గరగా వెళ్ళి, "ఎల్లా ఉందమ్మా?" అంది.

"మావూరే బాగుంతుంది మీవురు కంతే" అంది శేషి.

"అమ్మ వస్తుందీ, బెంగపెట్టకోకే తల్లీ! నీకు ఎంచక్కా ఎన్నో తెస్తా నాన్న. అన్నయ్యకొక్కటీ ఇవ్వకేం?"

"మా అమ్మ వచ్చేకానూ మా వూరెల్లిపోతాం గాదూ?"

"అలాగే తల్లీ!"

"అన్నయ్యే బెంగత్తుకున్నాలు. బెంగత్తుకోలేదు."

"అవునమ్మా! మవ్వు బంగారు తల్లివి"

ఇంతలో మా అమ్మ తలుపుతెరుచుకొని ఒక గాలివానలా వచ్చిపడింది శేషి మా అమ్మ భుజంమీదికి ఒక్క ఎగురు ఎగిరింది. ఇద్దరూ చాలాసేపు మాట్లాడ లేకుండా ఏడిచారు.

"నాతల్లినొక్కత్తినీ వదలి వెళ్ళిపోయావమ్మా! నాతల్లిని." అంది మా అమ్మ కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ.

శేషి వెక్కి వెక్కి ఏడుస్తూ "అన్నయ్య నన్ను బెంగ తుకున్నావన్నాలు" అంది

'కొడదాంలే అమ్మ. అన్నయ్యని' అని సముదాయించింది మా అమ్మ.

నాకు మా అమ్మమీద చాలాకోపం వచ్చింది మా శేషి ఏడిచిందంటే చిన్న పిల్ల. మా అమ్మ ఎందుకు ఏడవాలి? అయినా నేను మాత్రం బెంగెట్టుకోలేదూ?

మా అమ్మ బుజ్జగించినప్పుడు నాకూ ఏడుపు వచ్చింది! మా శేషి మాత్రం ఆనాడే సుఖంగా పాడింది, ' అలంకరించుకోవే కోడలా? అత్తవారింటికి పోవాలి."

పెళ్ళి అయిన తరవాత మా శేషి శేషు అయింది. బావ అల్లాగే పిలిచేవాడు దాన్ని. దాని అదృష్టం మంచి కుటుంబంలో పడడమే కాదు. మంచి మొగుడుకూడా దొరికాడు

మా బావ ఆవేళ ఇంగ్లాండు వెడతాడు బారిష్టరు పరీక్షకి. కాని బారిష్టరంటే అప్పటికీ, ఇప్పటికీ మా శేషుకి ఏమిటో తెలియదు. అదేదో ఉద్యోగమనుకునేది.

నేనూ, మా బావా గదిలో కూర్చున్నాం గబుక్కున తలుపు తోసుకుని "నల్లవాడే గొల్లపిల్లవాడే" అంటూ పాడుకుంటూ వచ్చింది. బావ గదిలో ఉన్నట్టుగా అది ఎరగదు. అందువల్ల వెంటనే నాలిక కరుచుకుని పాట మానివేసింది. మా బావ అన్నాడు "అబ్బా! ఎంత భయం నటిస్తున్నావు?"

"అయితే పోనీయండి, మానివెయ్యనే వెయ్యను."

మళ్ళీ పాడింది "నల్లవాడే గొల్లపిల్లవాడే."

బావ పకపకమని నవ్వాడు. అందుకు కారణం ఉందికూడా. బావ నల్లగా ఉంటాడు. నాకూ నవ్వు వచ్చింది. శేషు సిగ్గువచ్చి ముఖం తిప్పుకుని వెళ్ళిపోయింది.


మేం సావిడిలోనుంచి భోజనాలకి పోతూవుంటే ప్రక్కగదిలో మళ్ళీ అదే పాట, నెమ్మదిగా తనలో తను పాడుకుంటూను. నేను తలుపు తొయ్యబోయాను. కాని మా బావ నా చెయ్యిపట్టుకు ఆపి కొంతసేపు విన్నాడు.

భోజనాలయి అంతా సావిడిలో కూర్చున్నాం. బావ మంచంమీద వెల్లగిల పడుకున్నాడు మా అందరి ముఖాలూ దీనంగా ఉన్నాయి. బావ వెళ్ళిపోతాడు ఆవేళ మళ్ళీ ఎన్నాళ్ళో.

ఒకకుర్చీలో బావకి కనబడకుండా కూర్చుని తమలపాకులికి ఈనెలుతీస్తోంది శేషి. పాడుకుంటోంది.

"నల్లవాడే గొల్లపిల్లవాడే."

బావ తదేకదీక్షతో వింటున్నాడు. కాని తను ఆపాట పాడుతున్నట్టుగా అది ఎరగదు. కళ్ళు దీనంగా ఆలోచిస్తున్నాయి. పెదవులు ఏడవడానికి సంకోచిస్తున్నాయి.




ఊర్పుతో ముక్కు కొంచెంగా అదురుతోంది.

ఇంతలో మా చిన్నతమ్ముడందుకున్నాడు. "నల్లవాడే గొల్లపిల్లవాడే."

శేషకి అప్పటికి తెలిసింది తనాపాట పాడుతున్నట్టుగా. వెంటనే ముఖం ఎత్తి చూసింది ఎవరన్నా కవిపెడుతున్నారా అన్నట్టు. మా తమ్ముణ్ని దగ్గరగా పిలిచి ప్రోత్సహించింది.

"పాడరా తమ్ముడా"

"నువ్వే పాడరాదు? సరదాగావుంటే. ఇందాకటినుంచీ పాడుతున్నావుగా!" అన్నాడు బావ.

శేష లేచి తమలపాకులు బావచేతికి ఇచ్చి చిరునవ్వు నవ్వుతుంటూ వెళ్ళిపోయింది లోపలికి.

బావ, నేను, ఊళ్లో చుట్టాలని చూడ్డానికి వెళ్ళి మూడుగంటలకి ఇంటికి తిరిగి వచ్చాం. శేష గొంతు గట్టిగా వినబడుతోంది. "నల్లవాడే గొల్లపిల్లవాడే."

గొంతుక సాఫీగాలేదు. గట్టిగా పాడిన కొద్దీ కొంత జంకుతోంది. రాబోయే కన్నీటితో ఆమె దెబ్బలాడుతోందా అనిపించింది. బావ గదిగుమ్మంలోకి వెళ్ళి నిలబడ్డాడు. ఆమె కళ్ళల్లో నీళ్ళు తుడుచుకోడానికి సావకాశం లేకపోయింది. చర్రున లేచి లోపలికి పారిపోయింది

మాబావ ఎంతో సానుభూతితో చిరునవ్వు నవ్వబోతూ కొంతసేపు అల్లా నిలబడ్డాడు.

''నేనూ, శేషూ బావని సాగనంప డానికి స్టేషనుకి వెళ్ళాం. రైలు రావడానికి ఇంకా ఒక పావుగంట వ్యవధి ఉంది. ఎవరమూ ఏమీ మాట్లాడకుండా నిలబడ్డాం

బావే అన్నాడు చివరకి ''నేనింకో పావుగంటలో రైలులో ఉంటాను.''

"మీతాళంచెవులో పాపం?'' అంది

జేబు తడుముకొని "ఓహో! నువ్వు తీశావా ఏమిటి?'' అన్నాడు.

''ఇదీ బాగానేవుంది. నేనేం ఎరుగుదును?''

కాని అదే తీసినట్టుగా చెప్పడంలోనే తెలిసిపోయింది. బావ రెట్టించి అడగలేదు.

రైలువచ్చి ఆగింది. సామాను రైలులో ఎక్కింది.

శేషుని చూస్తే నాకు గుండెలు దడదడ కొట్టుకున్నాయి. కొంచెం ముఖం ఒదికి వంచింది. పెదవులు సగం విప్పి వున్నాయి. వేలిగోటితో మునిపంటిని నొక్కుతూ నిలబడింది. కళ్ళలో నీటి బిందువులు ఇంక చెక్కులమీదికి జారడమే తరవాయి. వాటిని తుడుచుకుంటే తను ఏడుస్తో వున్నటు అందరికీ తెలిసిపోతుందని అల్లాగే నిలబడివుంది.

బావ దగ్గరగా వెళ్ళాడు శేషు తల ఎత్తలేదు.

''వెడుతున్నాను'' అన్నాడు.

శేషు తాళంచెవులగుత్తి బావచేతిలో పెట్టింది బావ ఆ చేతిని తనచేతిలోకి తీసుకున్నాడు

"ఛీ! ఏడవకు. ఎందుకు ఏడుస్తావు?'' అన్నాడు.

శేషు లేదన్నట్టు తలవూపింది గాని కన్నీటిని తుడుచుకోలేదు.

''ఇదిగో ఇల్లాచూడు నే వెళ్ళిరానా?''

శేషు సరేనన్నట్టు తల వూపింది. బావ శేషువీపుమీద ఒకసారి నిమిరి ఒక నిట్టూర్పు విడిచి రైలు ఎక్కాడు.

ఇంక మా శేషుకి అభిమానమంతా పోయి ముఖమెత్తి రైలువైపుచూస్తో మనసారా ఏడిచింది ఎవరన్నా చూస్తే ఏమనుకుంటారు? నేను ఊరుకోబెట్టడానికి వీల్లేనిపరిస్థితి అది. అసలు అటువంటి పరిస్థితులంటేనే నా కసహ్యం. ముఖం చిట్లించి, మా శేషుని వూరుకోబెట్టే బాధ్యత ప్రకృతికి వదలివేసి ఇంకో పక్కకి తిరిగిచూస్తో నిలబడ్డాను.

* * *

శేషు తరవాత శేషప్ప అయింది. ఈలోగా చాలా మార్పులు జరిగాయి. శేషప్ప అదృష్టం తలకిందు అయింది. మా బావ చాలా చిన్నవయస్సులోనే పోయాడు. ఆమెకు ఒక ఆడపిల్ల. డబ్బుకి లోటులేదు మాబావ అట్టే సంపాదించేదాకా బతక్కపోయినా అసలు వాళ్ళస్థితిగతులు మంచివి. బావ పోయిన తరవాత శేషప్ప మాదగ్గరే ఉంటూ వచ్చింది. మా మేనకోడలి కి ఒక సంబంధంచూపి పెళ్ళిచేశాం కుఱ్ఱవాడు. బి. ఎ.

యు వ

ప్యానయాడు, స్థితిగతులు చెప్పుకోతగ్గవి కాకపోయినా లోటులేని సందర్భం. కార్యంకూడా అయిపోయింది. అతను బి. ఎల్. చదివే ఉద్దేశ్యంతో కాపరం మద్రాసులో పెట్టదలచుకున్నాడు. ఇంకొక వారం రోజులికి అతను మద్రాసు వెడతాడనగా నేను స్వయంగా అతన్ని మా యింటికి తీసుకొచ్చాను.

మా ఊరివారందరికీ పదోసారి శేషప్ప తన అల్లుణ్ణి చూపించి అంటూ వచ్చింది, "మా అల్లుడండీ మద్రాసులో కలెక్టరీ చదవడానికి వెడుతున్నాడు"— బి. ఏ. అయినతరవాత ఏది చదివినా కలెక్టరీ అనే దాని నమ్మకం అల్లుడు తనలో తను నవ్వుకుని ఊరుకునేవాడు.

నేనుమాత్రం మందలిస్తూ అన్నాను. "ఒసే, కలెక్టరీ ఏమిటి? అదంత తేరగా ఉందనుకుంటున్నావా?" అల్లుణ్ణిగురించి అంత తెలిసిపోయేటట్టు గొప్ప చెప్పుకోవడం పద్ధతకాదని నా భయమేమో!

"అరి పీయమ్మా కడుపు బంగారం గానూ, మరి నాకా పరీక్షలు ఏదో తెలియవురా" మా శేషప్ప మాత్రం పకపక నవ్వింది.

కూతుర్ని దగ్గరగా తీసుకుని బుజ్జగిస్తూ అంది. "మాతల్లి ఏం కష్టపడుతుందో చెన్నపట్టణంలో. మాటా తెలియదు మంతీ తెలియదు గావును"

అల్లుడి ఎదుట కూతుర్ని అల్లా బుజ్జగించడం నాకు ఎందుకో నచ్చలేదు. "మరేం ఫరవాలేదు. నీకు మల్లే వెర్రిబాగుల్ది కాదులది" అన్నాను.

"అరి నీ యమ్మాకడుపు బంగారం గానూ, దానికేం తెలుసురా పాపం"

తను పెద్దదని పైకి ఏడవకూడదనే సంగతి దానికీ కొంతవరకూ తెలుసును. ఆవారం రోజుల్లోనూ చాటుగా ఎన్నో సార్లు కళ్లు తుడుమకోడం నేను చూశాను. కాని అల్లుడుచూస్తే అమర్యాద అని నా అనుమానం. ఆమె ఏడుపు నటన కాదని నాకు తెలిసినా వాంఛించే ఇతరులఎదట అది వెకిలితనంగా, నటనగా అగుపడిపోతుందేమోనని నాభయం శేషప్ప చివరదాకా తననికూడా అల్లుడు మద్రాసు రమ్మంటా దేమోనని మహా ఆశపడింది.

వెళ్ళేనాడు మేమంతా భోజనాలు అయాక సావిడిలో కూర్చున్నాము అల్లుడు పత్రిక చదువుతున్నాడు కుర్చీలో కూర్చుని.

"ఏమోయి! మద్రాసులో ఏవో రోడ్ల మీద నడిచే బళ్ళు ఉంటాయట గాదూ?" అంది అల్లుణ్ని ఉద్దేశించి.

"ట్రాములా అండి" అన్నాడుఅల్లుడు.

"రోడ్డుమీదయితే ఎల్లాఎక్కుతారవి?"

"వెళ్ళి చూస్తేగాని అర్థంకాదు" అన్నాను నేను

"పోనీ నేనూ వెడతాను." అల్లుడు మాత్రం వినబడనట్టు పత్రిక చదువుతున్నాడు.

అల్లుడికి వినబడకుండా నేను మందలించబోయాను.

"అటువంటి ఉద్దేశ్యాలు మనసులో

ఉన్నా పైకి తేలిపోవడం మంచిదిగాదు.''

"అరి పీయమ్మా కడుపు బంగారం గానూ. ఇందులో తప్పేమి ఉందిరా? '

మా మేనకోడలు గదిలోకి రాబోయి మొగుణ్ణిచూసి మళ్ళీ వెనక్కి వెళ్ళిపోబోయింది.

"రా అమ్మా! ఇల్లావచ్చి కూర్చోవచ్చు''

అది వచ్చి శేషప్పపక్కని కూర్చుంది

"మాతల్లి వెళ్ళిపోతుందీవేళ'' ఒక్కసారి ముక్కు పైకి ఎగపీల్చుకుంది. కళ్ళలో నలకపడ్డట్టు నటించి కళ్ళు తుడుచుకుంది.

"మళ్ళీ శలవుల్లో తప్పకుండా వచ్చెయ్యండోయి'' అంది అల్లుణ్ణి ఉద్దేశించి.

"అల్లాగేలెండి'' అన్నాడు అల్లుడు పత్రిక చదువుతోనే.

శేషప్ప కళ్ళు ఈసారి నీళ్ళతో నిండిపోయాయి. మేము ఏమీ అనుకోకుండా ఉంటే భోరుమని ఏడిచేదే. అల్లుడి ముఖానికి పత్రిక అడ్డుఉంది. శేషప్ప ముఖం పక్కకి తిప్పుకుని కళ్ళు తుడుచుకుంది. "పేపరు విశేషాలేమిటోయి?'' అంది. అనవసరపు ప్రశ్న!

కొంగు పరుచుకుని అవతలి పక్కకి తిరిగి పడుకుంది. ఈ సారి అది ఎంత దాచుకోడానికి ప్రయత్నించినా దుఃఖం దాగలేదు. అల్లా పడుకుని ఉండగా ఆమెకు ఎప్పుడు నిద్రపట్టిందో తెలియదు. నేను ఉన్నంతసేపూ అది ఏడుస్తూ ఉందనే అనుకున్నాను. రైలు వేళదాకా అది అల్లాగే నిద్రపోయింది.

నేను లేపాను. ''అరి పీయమ్మ కడుపు బంగారంగాను'' అంటూ కళ్ళు నులుపుకుంటూ లేచింది. రైలు వేళయిందని చెప్పాను. ఆమాట కొంతసేపటి వరకూ దానికి అర్థంకాలేదు.

బండివచ్చింది. సామానంతా బండిలో పెట్టుకున్నాడు బండివాడు. అల్లుడువెళ్ళి అవతల బండిదగ్గర నిలబడ్డాడు. మా మేనకోడలు అడుగులో అడుగు వేసుకుంటూ తల్లి దగ్గరకు వచ్చింది.

"అయ్యో! తల్లీ. వెళ్ళిపోతున్నావా అమ్మా!''

శేషప్ప జారుకుంది. అల్లుడు ఎదురుగా ఉన్నాడన్న సంగతి పూర్తిగా మరిచిపోయింది. వెక్కి వెక్కి చిన్నపిల్లలా ఏడించింది. ఇంక రైలువేళదాటిపోతుందని అల్లుడు తొందర పెట్టినమీదట కూతుర్ని రైలులో ఎక్కనిచ్చింది. బండి వెళ్ళిపోయినా అది ఏడుపుమాత్రం మానలేదు.

అయితే అప్పుడప్పుడు నాకో ప్రశ్న వస్తూ ఉంటుంది. మనసులో విచారాన్నంతటి నీ పైకి వదలి వెయ్యడం తప్పా? దానికి నా మనసులో ఒకటే సమాధానం. తప్పుకాకపోయినా సభ్యతకాదు. అయితే అటువంటి పరిస్థితుల్లో నేను ఏం చెయ్యాలి? దానికి మాత్రం నా మనసులో సమాధానంలేదు.